
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల

జిల్లా వార్తలు 3

సోమవారం 1 జులై 2024

వ్యవసాయ శాఖలో ప్రక్షాళన షురూ

- ఆదాయం తెచ్చే కుర్చీలకు భారీ డిమాండ్
- అందరి కళ్లు ఆ కుర్చీలపైనే..

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 30: వ్యవసాయ శాఖలో ప్రక్షాళన త్వరలోనే మొదలవుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. అయితే కీలకమైన కుర్చీలు దక్కించుకునేందుకు తెలుగుదేశం పార్టీలో ముఖ్య నాయకులను ప్రసన్నం చేసుకోడానికి కొంత మంది వ్యవసాయ శాఖ అధికారులు పరుగులు పెడుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వ్యవసాయ శాఖలో ఆదాయం భారీగా వచ్చే కుర్చీల కోసం కొంత మంది వ్యవసాయాధికారులు దృష్టి పెడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కొన్ని కీలక స్థానాలు ఒక సామాజిక వర్గానికి చెందిన వారే దక్కించుకున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన వ్యవసాయాధికారులకు అంతగా ప్రాధాన్యత లేని ప్రదేశాల్లో పోస్టులు ఇచ్చారని, ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టడంతో వారంతా ప్రాధాన్యత కలిగిన ప్రదేశాల్లో పోస్టింగులు ఇప్పించుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ముఖ్యంగా కర్నూలు సబ్ డివిజన్‌తో పాటు డోన్, నంద్యాల, ఎమ్మిగనూరు, ఆత్మకూరు, బనగానపల్లె, తదితర వ్యవసాయ డివిజన్ కేంద్రాల్లోని ఏడీఏ పోస్టులను దక్కించుకునేందుకు కొంత మంది వ్యవసాయాధికారులు తమ ప్రయత్నాలను తీవ్రం చేశారు. అదే విధంగా కర్నూలు, కల్లూరు, కోడుమూరు, నంద్యాల, డోన్ తదితర మండల వ్యవసాయాధికారులుగా పోస్టింగులు దక్కించుకునేందుకు మంత్రుల స్థాయిలో కొంత మంది వ్యవసాయాధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. డీలర్ల నుంచి పెద్ద ఎత్తున ఆదాయం అందడంతో పాటు లైసెన్సులు రెన్యువల్ చేసేందు కోసం శాంపుల్స్ పేరుతో పెద్ద ఎత్తున మామూళ్లను వసూళ్లు చేసే అవకాశం ఉన్న ఈ మండలాల్లో పోస్టింగులు దక్కించుకునేందుకు వారు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.



పింఛన్ల పండుగ

- ఒకేసారి రూ.1000 పెంపు
- మాట నిలుపుకున్న చంద్రబాబు
- నేడు లబ్ధిదారుల ఇళ్ల వద్దనే పంపిణీ
- గత మూడు నెలలది కలిపి ఒకేసారి..
- జిల్లా వ్యాప్తంగా 2,21,702 మంది లబ్ధిదారులు
- రూ.150.23 కోట్ల అందజేతకు సిద్ధం
- పెంచిన సొమ్ముతో వృద్ధుల్లో ఆనందోత్సాహాలు

పింఛన్ల పండుగ వచ్చేసింది. అవ్వా తాతలు, వికలాంగుల కళ్లలో ఆనందం వెల్లివిరిసింది. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విధంగా ముఖ్యమంత్రి అయిన వెంటనే చంద్రబాబు పింఛన్ల సొమ్ము పెంచి మాట నిలుపుకున్నారు. దీంతో సోమవారం జిల్లా వ్యాప్తంగా జరిగే పింఛన్ల పండుగ కార్యక్రమానికి సర్వం సిద్ధం చేశారు. ఎన్నికల ముందు టీడీపీ అధినేత పేదల సామాజిక పింఛన్‌ను రూ.3వేలను రూ.4 వేలకు పెంచుతానని హామీ ఇచ్చారు. ఏప్రిల్ నుంచి పెంచిన పింఛన్ సొమ్మును ఇస్తామని మాట ఇచ్చారు. ఆ మేరకు సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత చంద్రబాబు పేదల సామాజిక పింఛన్‌ను రూ.4వేలకు పెంచుతూ సంతకం చేశారు. అదేవిధంగా వికలాంగుల పింఛన్లు రూ.3 వేలను రూ.6వేలకు పెంచారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాటను నెరవేర్చి పేదల జీవితానికి ఆర్థిక భరోసా కల్పించారు.

నందికొట్కూరు/డోన్, జూన్ 30: నేడు ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ పథకం పంపిణీ పండుగ రాష్ట్ర వ్యాప్తంగా జరిపేందుకు టీడీపీ ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఏ పార్టీ తాము అధికారంలోకి వస్తే ఎన్నికల కోడ్ అమలైన నెల నుంచే పెంచిన పింఛన్‌ను అందజేస్తామని చెప్పలేదు. కాని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే రూ. 3 వేలు ఉన్న పెంఛన్‌ను ఏకకాలంలో నాలుగు వేలు చేస్తూ.... అది కూడా ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన నగదుతో పాటు మొత్తం ఈనెల లబ్ధిదారులకు రూ.7 వేలను నేడు అందజేయనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను టీడీపీ ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ప్రతి గ్రామంలో ప్రతి లబ్ధిదారుడికి ఒకే రోజులో సచివాలయ సిబ్బందితో ఇంటింటికి వెళ్లి అవ్వా తాతలకు పింఛన్ అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. నంద్యాల జిల్లాలో 2,21,702 మంది లబ్ధిదారులకు జూన్‌లో రూ.65.86 కోట్లు అందజేయగా ఈ నెలలో రూ.150.23 కోట్లు అందజేయనున్నారు.



ఎన్నికల ముందు బాబుపై కుట్ర

2024 ఎన్నికల ముందు వలంటీర్లతో పింఛన్ పంపిణీ చేయకుండా చేస్తున్నది చంద్రబాబే అని, తిరిగి టీడీపీ అధికారంలోకి వస్తే... బ్యాంకుల చుట్టూ, సచివాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుందని టీడీపీపై జగన్ విష ప్రచారం చేశారు. జగన్ మాటలు నమ్మని జనం టీడీపీకే పట్టం కట్టారు. వృద్ధులు, వికలాంగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం రూ.4 వేల పింఛన్ లబ్ధిదారులకు అందజేయనున్నారు.



ఒకే రోజులో పంపిణీకి శ్రీకారం

ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా ఒకే రోజే లబ్ధిదారులకు పింఛన్ అందించనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్లు అమలు చేసేందుకు శ్రీకారం చుట్టారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా ఇంటింటికి వెళ్లి పింఛన్ పంపిణీ చేయాలని గత రెండు రోజుల క్రితం మున్సిపల్ కమిషనర్లు, మండల స్థాయి అధికారులను ఆదేశించారు. ఆ దిశగా అధికారులు కూడా సిద్ధమయ్యారు. అలాగే పించన్ల పంపిణీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దగ్గరుండి చూసుకోవాలని టీడీపీ అధిష్టానం ఆదేశించింది. ఈ మేరకు మంత్రులు, ఎమ్మెల్యేలు, కిందిస్థాయి నాయకులు కూడా ఈ పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

డోన్ నియోజకవర్గంలో..

డోన్ నియోజకవర్గంలో 32,790 మంది లబ్ధిదారులు ఉన్నారు. డోన్ మున్సిపాలిటీలో 5,500 మంది పింఛనుదారులు ఉండగా.. వృద్ధాప్య పింఛన్ల లబ్ధిదారులు 2,558 మంది, వితంతువులు 1980 మంది, వికలాంగులు 633 మందితోపాటు ఒంటరి మహిళ, డప్పు కళాకారులు, చేనేతలు, కల్లుగీత కార్మికులు, ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారు. డోన్ రూరల్‌లో మొత్తం 7,702 మంది పింఛన్ల లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో వృద్ధాప్య పింఛన్లు 3,731 మంది కాగా, వితంతువులు 2,674 మంది, వికలాంగుల పింఛన్ల లబ్ధిదారులు 825 మంది ఉన్నారు. ఇతర పింఛన్ల లబ్ధిదారులు 502 మంది ఉన్నారు. ప్యాపిలి మండలంలో 9,076 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో వృద్ధాప్య పింఛన్లు 4,872 మంది కాగా, వితంతువులు 2,413 మంది, వికలాంగులు 1,082 మంది ఉన్నారు. 709 మంది ఇతర పింఛన్‌దారులు ఉన్నారు. బేతంచెర్ల మండలంలో 10,489 మంది ఉన్నారు. బేతంచెర్ల పట్టణంలో 6,203 మంది, రూరల్‌లో 4,286 మంది లబ్ధిదారులు ఉన్నారు.

రూ.23.56 కోట్లు మంజూరు

డోన్ నియోజకవర్గంలో 32,797 మంది లబ్ధిదారులకు రూ.23,56,25,500 మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్ల సొమ్మును అందజేసే విధంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలోని ప్రతి వార్డు, గ్రామాల్లో లబ్ధిదారుల ఇంటికే నేరుగా వెళ్లి పింఛన్ల సొమ్మును అందజేయనున్నారు.

జిల్లాలో మొత్తం పింఛన్‌దారులు

పింఛన్ల రకాలు	లబ్ధిదారులు	జూన్ పింఛన్ అమౌంట్	పెరిగిన నగదు
వృద్ధులు:	1,14,039	34,21,17,000	79,82,73,000
వితంతువులు:	62,736	18,82,08,000	43,91,52,000
దివ్యాంగులు:	26,185	7,85,55,000	15,71,10,000
చేనేత కార్మికులు:	996	29,88,000	69,72,000
కల్లు గీత కార్మికులు:	230	6,90,000	16,10,000
ట్రాన్స్‌జండర్స్:	245	7,35,000	17,15,000
ఒంటరిమహిళ:	4,286	1,28,58,000	3,00,02,000
మత్స్యకారులు:	1,806	54,18,000	1,26,42,000
క్రానికల్ డిసీజ్:	258	25,80,000	25,80,000
డప్పు కళాకారులు:	2,919	87,57,000	2,04,33,000
చర్మకారులు	2421	72,63,000	1,69,47,000
డీఎం అండ్ హెచ్‌వో	1,226	62,49,000	62,49,000
కళాకారులు	22	66,000	1,54,000
సైనిక్ వెల్‌ఫేర్ పింఛన్లు	6	30,000	30,000
అభయహస్తం:	4327	21,63,500	21,63,500
మొత్తం	2,21,702	65,86,77,500	1,50,23,21,000



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

శ్రీశైలంలో భక్తుల రద్దీ

శ్రీశైలం, జూన్ 30: శ్రీశైలం మహాక్షేత్రానికి ఆదివారం తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు క్షేత్రానికి తరలి వచ్చారు. ఆదివారం వేకువ జాము నుంచే భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందకు క్యూలైన్లలో భక్తులుబారులు తీరారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణ కట్టనందు స్వామివారికి తలనీలాలు సమర్పించి, పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు అధికారులు అల్పాహారం, నిరంతరం తాగునీరు అందజేశారు. భక్తుల రద్దీతో క్షేత్ర ప్రధాన వీధులు కిక్కిరిసిన కనిపించాయి. భక్తుల సౌకర్యార్థం నిత్యాన్నదాన భవనంలో అన్నప్రసాద వితరణ చేశారు. క్షేత్ర పరిధిలోని సత్ర సముదాయాలు రద్దీగా కనిపించాయి.



పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేశారు

- తప్పు చేసిన అధికారులపై విజిలెన్స్ విచారణ చేయిస్తాం
- రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ

బనగానపల్లె, జూన్ 30 : గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో గ్రామ పంచాయతీ వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం బనగాపల్లె ఎంపీడీవో కార్యాలయంలో.. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన మొట్టమొదటి మండల సర్వసభ్య సమావేశానికి మంత్రి బీసీ జనార్దర్‌రెడ్డి అతిథిగా హాజరయ్యారు. ఎంపీపీ మానసవీణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో తాగునీరు, విద్య, వైద్యం వ్యవసాయం, ఐసీడీఎస్, గృహనిర్మాణం తదితర శాఖలపై చర్చ జరిగింది. సర్పంచ్‌లు ఎంపీటీసీలు గ్రామాల సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. రామతీర్థంలో తీవ్రంగా ఉన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని సభ్యులు అన్నారు. పాతపాడులో పాఠశాల వద్ద డ్రైనేజీ అసంపూర్తిగా ఉందని, దాన్ని పూర్తి చేయాలని కోరారు. మిట్టపల్లె సర్పంచ్ తులసిరెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో వీధిలైట్లు వేయడానికి కూడా డబ్బుల్లేవని సభ దృష్టికి తెచ్చారు. తమ గ్రామంలో గత టీడీపీ హయంలో మంచినీటి ట్యాంకును నిర్మించారని, కానీ దానికి వైసీపీ ప్రభుత్వం విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదని వాపోయారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యాగంటిపల్లెలో వైసీపీ నాయకులు లబ్ధిదారులకు అనువైన చోట స్థలం ఇవ్వలేదని, దీంతో పేదలు ఇళ్లు నిర్మించుకోలేదని అన్నారు. నిర్మించని ఇళ్లను గతంలో అట్టహాసంగా ప్రారంభించారని మంత్రి ఆరోపించారు. కొందరు పంచాయతీ సెక్రటరీలు, వీఆర్‌వోలు విచ్చలవిడిగా వైసీపీ తొత్తులుగా మారారని, వారు ఎక్కడ ఉన్నా విజిలెన్సు విచారణ జరిపి సస్పెండ్ చేయిస్తామని అన్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో తప్పు చేసిన అధికారులను వదదిలిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు. చాలా చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు లేవని, ఈ వివరాలను ఇవ్వాలని మంత్రి సీడీపీవో ఉమా మహేశ్వమ్మను ఆదేశించారు. తిమ్మాపురంలో 5 ఏళ్లుగా పాఠశాల భవనాలు లేక ఇబ్బంది పడుతున్నా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేసిందన్నారు. అధికారులు, వైసీపీ నాయకులు కలిసి ప్రజలను వేధించి కష్టనష్టాలకు గురిచేశారన్నారు. తెలుగుదేశం పాలనలో అధికారులు స్వేచ్ఛగా పనిచేసి ప్రజలకు సేవలందించాలన్నారు. తాము ఎవరిపైనా కక్ష సాధింపు చర్యలకు పాల్పడమని, ఎన్నికల మ్యానిఫెస్టోకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధిని పరుగులు తీయిస్తామన్నారు. సోమవారం పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు బీసీ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగరాజు, ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీధర్‌రెడ్డి, డీఈలు నాగశ్రీనివాసులు, ఉమాకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

రూటు మార్చిన చిరుత

- మహానంది మాడ వీధుల్లో సంచారం
- పార్వతీపురం సమీపంలో కూడా..
- భయాందోళనలో కాలనీవాసులు



మహానంది మాడ వీధుల్లో చిరుతపులి అర్ధరాత్రి సంచరిస్తున్న దృశ్యం

మహానంది, జూన్ 30: మహానంది క్షేత్ర పరిసర ప్రాంతంలో రూటు మార్చుకున్న చిరుత ఆదివారం అర్ధరాత్రి మహానంది మాఢ వీధుల్లో సంచరించినట్టు సీసీ పుటేజీలో రికార్డు అయింది. అలాగే పార్వతీపురం సమీపంలో కూడా తిరిగినట్టు తెలుస్తోంది. దీంతో కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల మహానంది గోశాల వైపు రెండు పర్యాయాలు సంచరించిన చిరుత ఆదివారం అర్ధరాత్రి క్షేత్రంలోని మాఢ వీధుల నుంచి దేవస్థానం ప్రధాన కార్యాలయం వైపు వెళ్లినట్లు సీసీ పుటేజీల్లో కనిపించిందని అధికారులు చెబుతున్నారు. ఆదివారం సాయంత్రం మహానంది శివారు ప్రాంతంలోని పార్వతీపురం కాలనీకి అత్యంత సమీపంలో ఉండే నల్లమలలోని దట్టమైన పొదల్లో కనిపించిందని స్థానికులు తెలిపారు. దీంతో నల్లమల్ల సమీప గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ ఉన్నతాధికారులు చిరుతను పట్టుకొని సుదూర ప్రాంతానికి తరలించాలని స్థానికులతోపాటు భక్తులు కోరుతున్నారు.



కనిపించే దేవుళ్లు

● రోగులకు ప్రాణం పోస్తున్న వైద్యులు
● నేడు జాతీయ వైద్యుల దినోత్సవం

కర్నూలు(హస్పిటల్), జూన్ 30 : వైద్యుడు దేవుడితో సమానమని మన నమ్మకం. అత్యవసర సమయాల్లో రోగి బంధువులకు డాక్టరే దేవుడిలా కనిపిస్తాడు. వైద్య వృత్తికి ప్రపంచ వ్యాప్తంగా ఎంతో గుర్తింపు, సమాజంలో గౌరవం ఉన్నాయి. కరోనా మహమ్మారి కరాళనృత్యం చేస్తున్నా వేళ వైద్యులు ఉదయం నుంచి రాత్రి వరకు క్షణం తీరిక లేకుండా రోగుల సేవల్లో నిమగ్నమైపోయారు. రోగికి ప్రమాదకరంగా ఉంటే ఏ సమయంలో అయినా ఆసుపత్రికి చేరుకుని చికిత్స అందించాలనే తపనతో విధులు నిర్వర్తిస్తున్నారు. కొవిడ్ వార్డులో ఐసొలేషన్ వార్డులో పీపీఈ కిట్ వేసుకుని అత్యవసర సేవలు అందించడం తమ ప్రాణాలకు ప్రమాదమైనా చిత్తశుద్ధితో సేవలందిస్తూ కనిపించే దేవుళ్లలా వైద్యులు మారారు. అంతటి విశిష్టమైన వైద్యుల సేవలకు గుర్తింపుగా దేశంలో జూలై 1న ఏటా జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

అత్యవసర రోగుల కోసం



2022 డిసెంబరులో ఒక రోడ్డు ప్రమాదం జరిగింది. తెల్లవారుజామున 21 ఏళ్ల ఓ రోగిని 108 అంబులెన్సులో క్యాజువాల్టీకి తీసుకవచ్చారు. ఆ సమయంలో అతని తలకు తీవ్రగాయమై పరిస్థితి విషమంగా ఉంది. నోటిలో, ఊపిరితిత్తుల్లో రక్తం చేరడంతో ఊపిరి తీసుకుని పరిస్థితి నెలకొంది. వెంటనే రోగికి సక్షన్ చేసి న్యూరోసర్జరీ వైద్యులకు రెఫర్ చేశాం. త్వరగా వ్యాధిని గుర్తించి న్యూరోసర్జరీ ఆపరేషన్ చేయడంతో రోగి కోలుకున్నాడు.

- డా.సి. క్లింటన్, క్యాజువాల్టీ మెడికల్ ఆఫీసర్, కర్నూలు జీజీహెచ్



ప్రాణాలు కాపాడిన సర్జరీ వైద్యులు



తెలంగాణ రాష్ట్రం అమరవాయి గ్రామానికి చెందిన 19 ఏళ్ల మాలిక్‌బాషా డ్రైవర్ ఇసుక లారీ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఇసుక లారీ వేగంగా వెళ్తూ చెట్టుకు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మాలిక్‌బాషా తొడలోనికి చెట్టుకొమ్మ చొచ్చుకునిపోయింది. మే 8వతేదీన బాధితుడు తీవ్ర రక్తస్రావంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి వచ్చాడు. ప్రొఫెసర్ డా. చక్రవర్తి నేతృత్వంలో వైద్యబృందం డా. విజయశంకర్, డా. భాస్కర్ రెడ్డి, డా. అనూష, డా. జగనన్మోహన్ రెడ్డి మూడు గంటలు శ్రమించి తొడలోనికి చొచ్చుకునిపోయిన చెట్టుకొమ్మను తొలగించి రోగి ప్రాణాన్ని కాపాడారు. తన 30 ఏళ్ల వైద్య అనుభవంలో ఈ కేసు అత్యంత అరుదైన కేసు అని ప్రొఫెసర్ చక్రవర్తి అన్నారు.

- డా.చక్రవర్తి

ప్రఖ్యాత వైద్యుడు పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బిపిన్ చంద్రరాయ్ పుట్టిన రోజునే మన దేశంలో డాక్టర్స్ డేగా జరుపుకుంటున్నారు. ఆయన కలకత్తా మెడికల్ కాలేజీలో వైద్యవిద్య, లండన్‌లో ఉన్నత విద్య అభ్యసించాక 1911లో స్వదేశానికి వచ్చి వైద్యసేవలు ప్రారంభించారు. కలకత్తా మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పని చేశారు. మహాత్మాగాంధీతో కలిసి స్వాతంత్రోద్యమంలోనూ పాల్గొన్నారు. వైద్యవృత్తిలో విశేష సేవలు అందించిన ఆయన 1882 జూలై 1న జన్మించగా.. 1962 జూలై 1న మరణించారు. వైద్య రంగంలో విశేష సేవలందించినందుకు గాను 1961 కేంద్రం ప్రభుత్వం ఆయనకు భారతరత్న అవార్డును అందజేసింది.

కొవిడ్‌లో విశేష సేవలు



2021 కొవిడ్ సమయంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్ఎంవోగా ఉన్నప్పుడు రోగులకు సేవలు అందించడం ఎంతో సంతృప్తి ఇచ్చింది. నందికొట్కూరు చెందిన 40 ఏళ్ల ఓ మహిళ రోగికి కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో కర్నూలు జీజీహెచ్‌లో చేరింది. అర్ధరాత్రి సెంట్రల్ ఆక్సిజన్ ఫ్లో తక్కువగా ఉండటంతో బల్క్ సిలిండర్ కోసం అర్ధరాత్రి జోరుగా వర్షం కురుస్తున్నా సిలిండర్‌ను తీసుకుని వచ్చి రోగికి అమర్చాను. ఇది నా 40 ఏళ్ల వైద్యవృత్తిలో ఎంతో సంతృప్తి ఇచ్చింది.

- డా.వై. ప్రవీణ్ కుమార్, డీఎంహెచ్‌వో

మంత్రి టీజీ భరత్ క్యాంప్ ఆఫీసు సిద్ధం

● తీర్చిదిద్దుతున్న కార్పొరేషన్ సిబ్బంది



కర్నూలు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ క్యాంప్ కార్యాలయం సిద్ధం చేస్తున్నారు. వెంకటరమణ కాలనీలో ఏపీఎస్పీ బెటాలియన్ మైదానం ఆనుకొని ఆఫీసు ఏర్పాటు చేశారు. 2014-19 వరకు ఆనాటి డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, 2019-2024 మధ్యలో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంగా ఉపయోగించుకున్నారు. అదే కార్యాలయానికి రంగులు వేసి, మరమ్మతులు చేసి మంత్రి టీజీ భరత్ క్యాంప్ ఆఫీసుగా తీర్చిదిద్దారు. 50-60 మందికిపైగా విజిటర్స్ కూర్చోవడానికి వీలుగా పెద్ద హాలు, మంత్రికి ప్రత్యేకంగా ఛాంబరు, మంత్రి వద్ద పని చేసే పీఏ, సిబ్బంది కోసం రెండు ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. మంత్రి విశ్రాంతి తీసుకోవడానికి ప్రత్యేక గది తీర్చిదిద్దారు. క్యాంప్ ఆఫీసు లోపల, బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఏసీలు కూడా అమర్చారు. గతంలో డిప్యూటీ సీఎంగా పని చేసిన కృష్ణమూర్తి, ఆర్థిక శాఖ మంత్రిగా పని చేసిన బుగ్గన ఈ ఆఫీసుకు వచ్చిన సందర్భాలు చాలా అరుదు. మంత్రి టీజీ భరత్ అయినా పూర్తి స్థాయిలో క్యాంప్ కార్యాలయం వినియోగించుకుంటారా..? తెలియాలంటే కొన్నాళ్లు వేచి చూడాల్సిందే.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం

నంద్యాల (నూనెపల్లె), జూన్ 30: నంద్యాలలోని కలెక్టరేట్ ఆవరణలో ఉన్న సెంటనరీ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు జిల్లా అధికారులంతా హాజరు కావాలని అన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంతోపాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

14న పోస్టల్ ఉద్యోగుల సొసైటీ ఎన్నికలు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 30: కర్నూలు డివిజన్ పోస్టల్ ఉద్యోగుల కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికలు 14న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ జి. రామక్రిష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 4న ఉదయం 10 గంటల నుంచి 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 6న ఉపసంహరణ ఉంటుందన్నారు. 14న పోలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పోస్టల్ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పీఆర్ ఇన్‌చార్జి ఎస్ఈగా రామ్మోహన్

కర్నూలు(న్యూసిటీ), జూన్ 30: పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కర్నూలు జిల్లా ఇన్‌చార్జి ఎస్ఈగా నంద్యాల ఈఈగా విధులు నిర్వహిస్తున్న రామ్మోహన్‌ను నియమిస్తూ ఈఎన్‌సీ బాలునాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా ఆదోని పీఆర్ ఇన్‌చార్జి ఈఈగా కర్నూలు ఈఈ మద్దన్నను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే కర్నూలు ఎస్ఈ కే సుబ్రమణ్యం, ఆదోని ఈఈ ఏ. వెంకటప్రసాద్ ఆదివారం పదవీ విరమణ పొందారు. దీంతో వీరి స్థానంలో తాత్కాలికంగా ఇన్‌చార్జిలను నియమిస్తూ ఈఎన్‌సీ ఉత్తర్వులు జారీ చేశారు.

హోరాహోరీగా గుర్రపు బండ్ల పోటీలు



హోరాహోరీగా సాగుతున్న గుర్రపు బండ్ల పోటీలు

మిడుతూరు, జూన్ 30: మిడుతూరు గ్రామంలో హోరాహోరీగా గుర్రపు బండ్ల పోటీలు జరిగాయి. ఈ పోటీలు మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధన సందర్భంగా ఆదివారం కాతా రామచంద్రా రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ కాత రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. 11గుర్రపు బండ్లు పందెంలో పాల్గొన్నాయి. ఈ పోటీల్లో విజేతలుగా మొదటి బహుమతిగా బళ్లారికి చెందిన ఇమ్రాన్ గుర్రం 25 తులాల వెండి, రెండో బహుమతి మిడు తూరుకు చెందిన ముర్తుజావలి గుర్రం 20 తులాల వెండి, మూడో బహుమతి నందికొట్కూరుకు చెందిన పఠాన్ బాష గుర్రం 15 తులాల వెండి అందించారు. నాలుగో బహుమతి ఆత్మకూరుకు చెందిన ఫరూక్ బాషా గుర్రం 10 తులాల వెండి, ఐదో బహుమతి నంద్యాలకు చెందిన షేక్ హబీబ్ బాషా గుర్రం 5 తులాల వెండి పతకాలు గెలుచుకున్నాయి. పోటీల్లో పాల్గొన్న వారికి నిర్వాహకులు భోజన వసతి కల్పించారు. పోటీల్లో గెలిపొందిన వారికి కాతా రామచంద్రా రెడ్డి, మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, కాతా రాజ రెడ్డి, కాతా విష్ణు వర్ధన్ రెడ్డి, బన్నూరు హరిసర్వోత్తమ రెడ్డి, యరభం ప్రమోద్ రెడ్డి బహుమతులు అందజేశారు.

అసైన్‌మెంట్ భూమిలో ప్రైవేటు వెంచర్

● సాగు కోసం ఇచ్చిన భూమిలో ప్లాట్ల అమ్మకాలు
● పక్కన ఉన్న పోరంబోకు, వాగు స్థలం ఆక్రమణ ?

పాణ్యం, జూన్ 30: మండలంలోని తమ్మరాజుపల్లెలో అసైన్‌మెంట్ భూమిలో ప్రైవేటు వెంచర్ వేశారు. సాగు కోసం ఇచ్చిన భూమిలో ప్లాట్లు వేసి అమ్మకాలు జరుపుకున్నారు. తమ్మరాజుపల్లెలోని 208-ఏ సర్వే నెంబరులో 2.70 ఎకరాలు, 208-బీ సర్వే నెంబరులో 1.79 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి కమ్మరి వర్గానికి కేటాయించినట్లు ఆర్ఓఆర్‌లో నమోదైంది. 1998 సెప్టెంబరు 3న 208-బీ1 సర్వే నెంబరులో 89 సెంట్లు, 208-బీ2లో 90 సెంట్లు వడ్డె కృష్ణమూర్తికి అసైన్‌మెంట్ కమిటీ ద్వారా రెవెన్యూ శాఖ డీపట్టా మంజూరైంది. 2004లో నాలుగు రోడ్ల నిర్మాణంలో భాగంగా ఈ భూమిలోని 76 సెంట్లు హైవే నిర్మాణానికి భూ సేకరణ శాఖ స్వాధీనం చేసుకుంది. మిగిలిన 1.03 ఎకరాల్లో రైతు కృష్ణమూర్తి పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఇటీవల ఈ భూమిలో అధికారులకు తెలియకుండానే ప్రైవేటు లేఅవుట్లు వేసి ఇంటి పట్టాల అమ్మకాలు చేపట్టారు. అలాగే ఈ భూమికి పక్కన ఉన్న వాగు పోరంబోకు స్థలం ఆక్రమించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతి లేకుండా ప్లాట్లు వేయడంతో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

అసైన్‌మెంట్ భూమిలో ప్లాట్లు వేయరాదు : పణికుమార్, తహసీల్దారు, పాణ్యం : అసైన్‌మెంట్ భూమిలో ప్లాట్లు వేయరాదు. అటువంటి భూమికి ల్యాండ్ కన్వర్షన్ చేయడం కుదరదు. వాగు పొరంబోకు, ప్రభుత్వ మిగులు భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు. తమ్మరాజుపల్లెలోని అసైన్‌మెంట్ భూమిలో ప్లాట్లు వేసినట్లు తమ దృష్టికి వచ్చింది. వెంటనే చర్యలు చేపడతాం.



తమ్మరాజుపల్లెలోని 208బీ2 అసైన్‌మెంట్ భూమిలో వేసిన ప్రైవేటు వెంచర్

ఏవీని అరెస్టు చేయాలి

నంద్యాల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఏవీ సుబ్బారెడ్డిని అరెస్టు చేయాలంటూ శ్రీదేవి కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి, కూతురు రమ్య డిమాండు చేశారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఏవీ సుబ్బారెడ్డి ఇంటి ముందు ఆదివారం వారు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏవీ సుబ్బారెడ్డి వల్ల తమకు ప్రాణ హానీ ఉందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి అఖిలప్రియ విజయానికి తమ అమ్మ శ్రీదేవి ఎంతో కృషి చేశారని తెలిపారు. అలాంటిది ఆమెను చంపిన వ్యక్తుల పట్ల టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. టీడీపీలో ఉన్నాడనే ఆలోచనతోనే ఆయనను ప్రభుత్వం అరెస్టు చేయకుండా ఆపుతోందని, పార్టీ నుంచి సస్పెండ్ చేయించాలని డిమాండ్ చేశారు. గతంలో తమ చిన్నాన్న మోహన్‌రెడ్డిపై కూడా దాడి జరిపించింది ఏవీ సుబ్బారెడ్డేనని, ఇప్పుడు ఏకంగా తమ అమ్మను చంపించి అమెరికాలో కూర్చున్నాడని అన్నారు. ఏవీని అరెస్టు చేయకపోతే తమను కూడా చంపేస్తాడని, రక్షణ కల్పించాలని కోరారు. కేసును సీబీ సీఐడీకి అప్పగించాలని విజ్ఞప్తి చేశారు.



ఏవీ సుబ్బారెడ్డి ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

అకౌంట్స్ సమర్పించకుంటే అనర్హత వేటు


కలెక్టర్ డాక్టర్ కే. శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల (నూనెపల్లె), జూన్ 30: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఎన్నికల్లో ఖర్చు చేసిన మొత్తాలకు తుది అకౌంట్స్‌ను వ్యయ పరిశీలకులకు సమర్పించాలని కలెక్టర్ డాక్టర్ కే శ్రీనివాసులు అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని సెంటునరీ హాల్‌లో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల ఖర్చుపై వ్యయ పరిశీలకులతో కలిసి కలెక్టర్ వివిధ పార్టీల అభ్యర్థులు ఏజెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల వివరాలను జూలై 3వ తేదీ లోగా తప్పకుండా సమర్పించాలని, లేకపోతే వారిపై అనర్హత వేటు వేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఫలితాలు వెల్లడైన 30 రోజులలోపు ప్రతి అభ్యర్థి తమ వ్యయ వివరాలను బిల్లులతో సహా అధికారులకు అప్పగించాలని, పరిమితికి మించి ఖర్చు చేసినా లెక్కలను సరైన సమయంలో చూపకున్నా అభ్యర్థులపై అనర్హత వేటు పడటంతోపాటు తరువాత ఎన్నికల్లో పోటీ చేసే అర్హత కూడా కోల్పోతారని తెలిపారు. సమావేశంలో పార్లమెంట్, నియోజక వర్గాల వ్యయపరిశీలకులు, సహాయ అధికారులు, అభ్యర్థులు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు



తవ్వకాలు జరిపిన దృశ్యం

గూడూరు, జూన్ 30: తిమ్మాపురం అంజనేయస్వామి ఆలయంలో గుప్త నిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు జరిపిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గూడూరు మండలంలోని తిమ్మాపురం చెరువు సమీపంలో పురాతన అంజనేయస్వామి ఆలయం ఉంది. ఇక్కడ ప్రతి శనివారం చెరువు సమీపంలో ఉన్న రైతులు పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం పూజలు చేసేందుకు రైతులు అంజనేయస్వామి ఆలయానికి వెళ్లారు. ఆలయంలో గుప్త నిధుల కోసం గుర్తు తెలియని దుండగులు తవ్వకాలు జరిపినట్లు వారికి తెలిసింది. ఈ విషయాన్ని రైతులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఆదివారం గూడూరు పోలీసులు ఆలయానికి వెళ్ళి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తిమ్మాపురం జయన్న, లక్ష్మన్న, శేఖర్, హనుమంతు, నాగేష్ మాట్లాడుతూ తవ్వకాలు జరిపిన గుర్తు తెలియని దుండగులను పోలీసులు పట్టుకోవాలని కోరారు.


ఇచ్చిన హామీ ప్రకారం సామాజిక పింఛన్లు



ప్రసంగిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), జూన్ 30: ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర మంత్రి ఫరూక్ అన్నారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయం వద్ద ఆ సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కూడా వారికి రావాల్సిన శాతం మేరకు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రముఖ న్యాయవాది రామచంద్రారావు, కౌన్సిలర్ శ్యాంసుందర్‌లాల్, దివ్యాంగుల సంక్షేమ సంఘం సమన్వయకర్త రమణయ్య, అధ్యక్షుడు సుబ్బారెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం



బాధిత మహిళలను పరామర్శిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), జూన్ 30: నంద్యాలలో ఓ పిచ్చికుక్క ఆదివారం స్వైర విహారం చేసింది. ప్రియాంక నగర్‌లో మనుషులపై విచక్షణా రహితంగా దాడి చేసింది. అక్కడి నుంచి పద్మావతి నగర్, టెక్కె, సరస్వతి నగర్, రెవెన్యూ క్వార్టర్స్‌లో దాదాపు 25 మందిపై దాడి చేసి గాయ పరిచింది. ప్రియాంక నగర్‌కు చెందిన లక్ష్మీదేవికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెతోపాటు మరో ఇద్దరు మహిళలకు తీవ్రంగా గాయాలు కావడంతో నంద్యాల సర్వ జన వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. మరి కొంత మంది ఆసుపత్రిలో ఇంజక్షన్లను వేయించుకుని తిరగి వెళ్లారు. నంద్యాలలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న మహిళలను మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

మహిళ ఆత్మహత్య

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 30: అనారోగ్యం కారణంగా మంగలి రాంపుల్లమ్మ(38) అనే మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఆదివారం మండలంలోని ఇటిక్యాల గ్రామంలో జరిగింది. రాంపుల్లమ్మకు నెల కింద విష పురుగు కాటేసింది. చికిత్స చేయించుకున్నా ఆరోగ్యం కుదుట పడలేదు. దీనికి తోడు భర్త లక్ష్మీనారాయణ తాగుడుకు బానిసగా మారడంతో జీవితంపై విరక్తి చెంది విషద్రావణం తాగింది. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేలోపు మృతి చెందింది. కేసు నమోదు చేశామని ఏఎస్ఐ గోవిందనాయక్ తెలిపారు.

యువకుడు ..

ఆదోని రూరల్ ఏప్రిల్ 30 : ఆదోని మండలం సంతేకుడ్లూరు గ్రామానికి చెందిన బసవరాజు(23) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ యువకుడికి రెండు నెలల క్రితం ఆలూరు మండలం హత్తి బెళగల్ గ్రామానికి చెందిన కవితతో వివాహమైంది. రోజు వారి కూలీ పని చేసుకొనే బసవరాజు మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం తన నివాసంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ శ్రీనివాసులు తెలిపారు.

వాసవీ నగర్‌లో చోరీ

కర్నూలు, జూన్ 30: నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో వాసవీ నగర్‌లో చోరీ జరిగింది. అనూష అనే మహిళ ఇంట్లో 12 తులాల బంగారు నగలు దొంగలు అపహరించారు. అనూష, ఆమె భర్త అనంతశర్మ శనివారం అర్ధరాత్రి బంధువుకు అనారోగ్యంగా ఉండటంతో ఆసుపత్రికి వెళ్లారు. ఉదయం ఇంటికి వచ్చి చూస్తే తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలో ఉన్న బంగారు నగలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకరయ్య తెలిపారు.

ముగిసిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

నంద్యాల (నూనెపల్లె), జూన్ 30: నంద్యాలలోని నందిపైప్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి పోటీలు ఆదివారంతో ముగిశాయి. వివిధ వయసు విభాగాలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంశీధర్ తెలిపారు. కార్యక్రమంలో శేషిరెడ్డి, రామరాజ్, సంజీవరెడ్డి, కోచ్ నాగార్జున పాల్గొన్నారు.

అంకిత భావంతో పని చేశారు: ఎస్పీ



పదవీ విరమణ పొందిన పోలీసు సిబ్బందితో ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల క్రైం, జూన్ 30: పోలీస్ శాఖలో అంకితభావంతో మంచి సేవలు అందించారని ఎస్పీ రఘువీర్‌రెడ్డి కొనియాడారు. నంద్యాల జిల్లాలో ఆదివారం పలువురు ఎస్‌ఐలు పదవీ విరమణ పొందారు. నంద్యాల వన్‌టౌన్ ఎస్‌ఐ సీహెచ్ పుల్లయ్య, నంద్యాల సీసీఎస్ ఎస్‌ఐ యాసీన్, మహానంది ఎస్‌ఐ బాలచంద్రుడు, బేతంచెర్ల ఎస్‌ఐ కలీముల్లాబేగ్, నంద్యాల సీసీఎస్ ఏఎస్‌ఐ ఇస్మాయిల్, డిస్ట్రిక్ట్ ఆర్మ్‌డు రిజర్వు ఏఆర్‌ఎస్‌ఐ ఇ.వెంకటేశ్వర్లు, బేతంచెర్ల ఏఎస్‌ఐ సి.శంకర్, డిస్ట్రిక్ట్ ఆర్మ్‌డు రిజర్వు హెడ్‌కానిస్టేబుల్ చలమయ్య, నంద్యాల డిస్ట్రిక్ట్ ఆర్మ్‌డు రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్ దామోదరం, నంద్యాల డిస్ట్రిక్ట్ ఆర్మ్‌డు రిజర్వ్ హెడ్‌కానిస్టేబుల్ శివశంకర్‌రెడ్డి పదవీ విరమణ పొందారు. పదవీ విరమణ చేసిన వారందరికీ నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సన్మాన సభ ఏర్పాటు చేశారు. అందరినీ ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. విధి నిర్వహణలో ఎక్కడా రాజీపడకుండా క్రమశిక్షణతో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారన్నారు. సుదీర్ఘకాలం పోలీస్‌శాఖలో పనిచేయడం అనేది గొప్ప విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ నరసింహులు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు మంజునాథ్, శ్రీనివాసులు, నాగభూషణం, ఆర్‌ఎస్‌ఐ హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు'



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా అధికారి లక్ష్మీదేవి

కొత్తపల్లి, జూన్ 30: సుదూర ప్రాంతాల నుంచి వచ్చి హాస్టళ్లలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు కష్టపడి ఇష్టంగా చదువుకుంటే ఉన్నత శిఖరాలు అందుకుంటారని నంద్యాల జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారిణి లక్ష్మీదేవి విద్యార్థులకు సూచించారు. ఆదివారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కొత్తపల్లి బీసీ బాలుర వసతి గృహాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులు, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించగా 115 మంది విద్యార్థులు హాజరైనట్లు గుర్తించారు. మిగతా విద్యార్థుల నుంచి వాకబు చేయగా.. పర్మిషన్‌తో సెలవుపై వెళ్లినట్లు అక్కడి ఇన్‌చార్జి వార్డెన్ షబ్బీర్‌బాషా జిల్లా అధికారిణికి వివరించారు. అనంతరం విద్యార్థులతో ఆమె మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్ మెనూ ప్రకారం భోజనం అందుతుందా అని పలు విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

మహిళా విభాగం చైర్‌పర్సన్‌గా స్వర్ణలత

పాణ్యం, జూన్ 30: మానవ హక్కుల కమిషన్ మహిళా విభాగం పాణ్యం మండల చైర్‌పర్సన్‌గా పిల్లి స్వర్ణలతను నియమించినట్లు జాతీయ మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు గుండారెడ్డి మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సౌత్ ఇండియా కోఆర్డినేటర్ దేవానందనాయుడు, రాష్ట్ర ఇన్‌చార్జి రామకృష్ణ, నంద్యాల జిల్లా చైర్మన్ వినోద్‌కుమార్ చేతులమీదుగా నియామక పత్రం అందజేసినట్లు తెలిపారు.

లోపించిన పారిశుధ్యం



ఇస్కాల గ్రామంలోని గొల్లపేటలో బురదమయంగా రహదారి

పాములపాడు, జూన్ 30: మండలంలోని ఇస్కాల గ్రామంలోని గొల్లపేట, బోయపేట తదితర వీధులలో డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణ సరిగా లేకపోవడంతో నిత్యం రోడ్లపై మురుగు ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గొల్లపేటలో సీసీ రోడ్డుపై నాలుగు ఇంచులమేర మన్ను పేరుకపోయింది చినుకు పడితే చాలు బురదమయంగా మారి గ్రామస్థులు నడవడానికి వీలులేక నానా ఇబ్బందులు పడుతున్న ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. బస్టాండు ఆవరణలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. డ్రైనేజీలను శుభ్రం చేయకపోవడంతో మురుగు రహదారిపైకి చేరుతోంది. దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ప్రజలు భయందోళనలు చెందుతున్నారు. అలాగే మిట్టకందాల, రుద్రవరం, చెలిమిళ్ళ లింగాల, తదితర గ్రామాలలోని వీధులు మురుగునీరుతో అపరిశుభ్రంగా ఉండటంతో వీటిపై అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నందికొట్కూరును పరిశుభ్రంగా ఉంచాలి: ఎమ్మెల్యే



నందికొట్కూరులో మురుగు కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



ప్రాతకోటలో జయసూర్యను సన్మానిస్తున్న గ్రామస్థులు

నందికొట్కూరు, జూన్ 30: నందికొట్కూరు పరిశుభ్రంగా ఉండాలంటే అందుకు కార్మికులే ప్రధాన మూలమని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య కార్మికులకు సూచించారు. ఆదివారం ఉదయం పట్టణంలోని 16వ వార్డులో పారిశుధ్య పనులను పరిశీలించారు ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణం పరిశుభ్రంగా ఉండాలన్నా, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్న ప్రధానంగా పారిశుధ్య కార్మికులు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తేనే సాధ్యమవుతుందని అన్నారు. పట్టణంలో ఎక్కడా చెత్తాచెదారం పేరుకుపోయిందన్న ఫిర్యాదులు రాకూడదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లింగమయ్య, బ్యాటరీ బాషా, శ్రీను, నిమ్మకాయల రాజు, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

● నందికొట్కూరులోని సీఎస్‌ఐ చర్చిలో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యను ఆ సంఘం సభ్యులు సన్మానించారు. ఆదివారం ఎమ్మెల్యే ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత గురువులు ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. అనంతరం సీఎస్‌ఐ చర్చి సంఘం సభ్యులు జాన్, రవి తదితరులు ఎమ్మెల్యేను సన్మానించారు.

ఎమ్మెల్యేకు సన్మానం

పగిడ్యాల: ప్రాతకోట గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యను గ్రామ టీడీపీ నాయకులు సన్మానించారు. నీటి సమస్య పరిష్కారాన్ని ఏర్పాటు చేసిన నూతన బోర్లను ఎమ్మెల్యే ఆదివారం పరిశీలించారు. గ్రామంలోని మైనార్టీ, ఎస్సీ కాలనీలో తీవ్ర నీటి సమస్య ఉండటంతో ఆ కాలనీల ప్రజలు ఎన్నికల ప్రచారంలో సమస్యను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కారించేందుకు గాను ఆయన ఆర్‌డబ్ల్యూస్ అధికారులతో మాట్లాడి నూతన బోర్లకు నిధులు మంజూరు చేయడంతో ఆయా కాలనీలో మూడు రోజుల క్రితం బోర్లను ఏర్పాటు చేశారు. దీంతో కాలనీ వాసులు, నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను సన్మానించి సంతోషాన్ని వ్యక్తం చేశారు. టీడీపీ మండల కన్వీనర్ పలుచాని మహేశ్వరరెడ్డి, నాగశేషులు, బాలీశ్వర్‌గౌడ్, వెంకటరెడ్డి, రమణ, వెంకటేశ్వర్లు, ఇస్మాయిల్, అశోక్ పాల్గొన్నారు.

నేడు పగిడ్యాలకు రాక

పగిడ్యాల: పగిడ్యాల ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం చేపటనున్న పింఛన్ పంపిణీ కార్యక్రమానికి సోమవారం ఎమ్మెల్యే జయసూర్య హాజరు కానున్నట్లు ఎంపీడీవో కవిరాజ్ తెలిపారు. ఉదయం 9గంటలకు కార్యలయానికి చేరుకొని లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తారని ఆయన తెలిపారు. మండలంలో 4947 పింఛన్లు ఉన్నట్లు తెలిపారు.

సంగమేశ్వరుడిని దర్శించుకున్న ఎమ్మెల్సీ తీన్‌మార్ మల్లన్న



మాట్లాడుతున్న తీన్‌మార్ మల్లన్న

కొత్తపల్లి, జూన్ 30: మండలంలోని సప్తనదుల లలితా సంగమేశ్వర స్వామివారిని తెలంగాణ ఎమ్మెల్సీ తీన్‌మార్ మల్లన్న దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఆయన తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన సోమశిల నుంచి మరబోటులో కృష్ణానది మీదుగా సంగమేశ్వరం చేరుకున్నారు. అక్కడి ఆలయ పురోహితుడు తెలకపల్లి రఘురామశర్మ సాదరంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు తీన్‌మార్ మల్లన్నతో చేయించారు. అనంతరం ఆయన సంగమేశ్వర ఆలయ విశిష్టతను పురోహితులను అడిగి తెలుసుకున్నారు. మల్లన్న తిరుగు ప్రయాణంలో ఆలయ సమీపంలో ఓ చెంచు మహిళ చిన్న పిల్లలతో భిక్షాటన చేస్తున్న దృశ్యాన్ని గమనించి కొంత ఆర్థిక సాయాన్ని అందించి వెళ్లిపోయారు.

'పథకాలను కొనసాగించాలి'



మాట్లాడుతున్న కేవీపీఎస్ నాయకులు

ఆత్మకూరు, జూన్ 30: వైసీపీ పాలనలో రద్దు చేసిన దళిత, గిరిజన సంక్షేమ పథకాలను తిరిగి అమలు చేయాలని కేవీపీఎస్ జిల్లా నాయకులు భాస్కర్, సంపత్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు స్వాములు కోరారు. ఆదివారం ఆత్మకూరులోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లకు నిధులను కేటాయించకుండా నిర్వీర్యం చేశారని ఆరోపించారు. అలాగే దళిత వాడలకు కూడా ప్రత్యేక నిధులను మంజూరు చేయలేదని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొత్తగా కొలువుతీరిన కూటమి ప్రభుత్వం దళిత, గిరిజనులకు గతంలో ఇస్తున్న సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని కోరారు. దళిత, గిరిజన వాడల అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు.

'సమ సమాజ స్థాపనే లక్ష్యంగా పనిచేయాలి'



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్

ఆత్మకూరు, జూన్ 30: దేశంలో సమసమాజ స్థాపనే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు, ఏసురత్నం అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజకీయ శిక్షణా తరగతుల్లో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రాల్లో పాలకులు మారుతున్నారే తప్ప ప్రజల సమస్యలు మారండం లేదని అన్నారు. ఈపరిస్థితుల్లో అభద్రతభావంతో ఉన్న ప్రజలకు అండగా నిలవాల్సిన బాధ్యత కమ్యూనిస్టులదేనని అన్నారు. పార్టీ నాయకులు రజాక్, రణధీర్, రామ్‌నాయక్, మంజుల, సురేంద్ర, షేక్ ఇస్మాయిల్, స్వాములు, నాగేశ్వరరావు, దినేష్, వీరన్న ఉన్నారు.

'50 శాతం రాయితీ ఇవ్వాలి'



నూతనంగా ఎన్నికైన మండల కమిటీ సభ్యులు

పాణ్యం, జూన్ 30: జర్నలిస్టుల పిల్లలకు విద్యలో 50 శాతం రాయితీ ఇవ్వాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ మద్దయ్య డిమాండ్ చేశారు. మండల ఏపి వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కమిటీ ఎన్నిక సందర్భంగా ఆదివారం పాణ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్హులైన జర్నలిస్టులకు నిబంధనలు లేకుండా ఇంటి స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. మండల కమిటీ అధ్యక్షుడిగా ఏకే శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా అప్సర్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా ఇప్ప సుధాకర్ గా, సహాయ కార్యదర్శిగా చిన్నరాజు, కోశాధికారిగా రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గడివేముల మండల కమిటీ అధ్యక్షుడిగా మహబూబ్ బాషా, ఉపాధ్యక్షుడిగా అంజన్ నాయక్, కార్యదర్శిగా రవికుమార్, సహాయ కార్యదర్శిగా శ్రీధర్ యాదవ్, కోశాధికారిగా రాముడు ఎన్నికయ్యారు. నియోజకవర్గ గౌరవాధ్యక్షుడిగా రంగస్వామి, అధ్యక్షుడిగా రమేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ నాగేంద్ర, ప్రధాన కార్యదర్శులు జగన్‌మోహన్, సుజాత, ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి, గడివేముల, పాణ్యం మండల విలేకరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా పీహెచ్‌సీ భవనం

● వైసీపీ హయాంలో హడావుడిగా ప్రారంభించిన వైనం ● పాత భవనంలో ఇబ్బందులు పడుతున్న రోగులు, వైద్యులు



అసంపూర్తిగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

జూపాడుబంగ్లా, జూన్ 30: మండల కేంద్రం జూపాడుబంగ్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం దాదాపు రూ. 2కోట్లతో నూతన భవనం నిర్మాణం చేపట్టారు. అయితే ఎన్నికల అసంపూర్తిగా పనులు ఉన్నా కూడా వైసీపీ శ్రేణులు హడావిడిగా ప్రారంభిచారని చర్చించుకుంటున్నారు. ఈ భవనాన్ని ఐదేళ్లపాటు నిర్మించిన కూడా కాంట్రాక్టర్ పనులను అసంపూర్తిగానే ఉంచారు. ప్రారంభించిన సమయంలో కాంట్రాక్టర్ తాత్కాలిక విద్యుత్ సరఫరా అందించి తర్వాత తొలగించారు. నూతన భవనంలో అన్నీ సౌకర్యాలతో నిర్మించిన అసంపూర్తిగా ఉండటంతో వైద్యసిబ్బంది మాత్రం అందులోకి రాకుండా పాతభవనంలో ఇబ్బందులు పడుతున్నారు. రోగులు కూడా చెట్టకిందే ఆరుబయట కూర్చోవాల్సి వస్తోంది.

అసంపూర్తిగా పనులు

దాదాపు రూ. 2కోట్లతో నిర్మించిన కూడా కాంట్రాక్టర్ పనులను అసంపూర్తిగా వదిలేసి పోయినట్లు తెలుస్తోంది. ప్రధానంగా విద్యుత్ సరఫరా లేదు. కాంపౌండు పరిధిలో సీసీ రోడ్డు నిర్మించి గ్రావెల్ వేయకుండా వదిలేశారు. ప్రధానగేటు వద్ద కల్వర్లు కట్టాల్సి ఉండగా అదికూడా చేయలేదని వైద్యులు చెబుతున్నారు. ఇన్నీ సౌకర్యాలతో నిర్మించిన భవనాన్ని దిష్టిబొమ్మలా వదిలేశారని విమర్శిస్తున్నారు. అసంపూర్తిగా వదిలేసిన పనులు పూర్తిచేసి రోగులకు, వైద్యసిబ్బందికి సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

రోగులకు అందని వైద్యసేవలు

పాత భవనంలో రోగులకు వైద్యసేవలు అందడంలేదు. కనీసం వైద్యులు కూర్చోడానికి స్థలంలేదు. ఇటీవల పోతులపాడు మజారా గ్రామం చాబోలులో అతిసార బారిన 30 మందికి కనీసం సేవలు అందించలేని స్థితిలో ఉన్నారు. అదే నూతన భవనం పనులు పూర్తిఅయిఉంటే ఈ రోగులందరికి ఇక్కడే వైద్యసేవలు అందించేవారు. ఒకరి ప్రాణం పోవడానికి కారణమయ్యారు. సౌకర్యాలు ఉంటేవారిని కాపాడేవారని ప్రజలు అంటున్నారు. పాతభవనంలో ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో ఉన్న సిబ్బందంతా ఒకే గదిలోనే కూర్చోవాల్సి వస్తోంది.

ఈ విషయమై ఆరోగ్య విస్తరణ అధికారి రాముడును వివరణకోరగా విద్యుత్తు సరఫరాకోసం రూ. 62వేలు డీడీ కట్టామని తెలిపారు. పనులు కూడా కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశారని, ఇంజినీరింగ్ అధికారులకు చెప్పిన పట్టించుకోవడంలేదని అన్నారు. సౌకర్యాలులేకపోవడంతో నూతన భవనంలోకి వెళ్లలేకపోతున్నామని అన్నారు.

నిర్లక్ష్యంగా అధికారులు



అసంపూర్తిగా భవననిర్మాణం పనులు ఉన్న కూడా ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతోనే వైసీపీ శ్రేణులు ప్రారంభించారు. దీంతో కాంట్రాక్టర్ కూడా పనులు చేపట్టకుండా వదిలిపెట్టి పోయారు. ఇటీవల అతిసార బాధితులను కూడా వైద్యశాలకు తరలించకుండా ప్రైవేటు వైద్యశాలలకు రోగులు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొని ఒకరు ప్రాణాలను కోల్పోయారు. ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తిచేసి రోగులకు సౌకర్యాలు కల్పించాలి.

- రవికుమార్‌యాదవ్, టీడీపీ నాయకుడు, జూపాడుబంగ్లా

'కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి'

ఆత్మకూరు రూరల్, జూన్ 30: నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం కౌలు రైతుల సమస్యలపై దృష్టి సారించి, వారి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ కుమార్, జిల్లా కార్యదర్శి సుధాకర్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపేందుకు సంతకాల సేకరణ చేపట్టారు. వారు మాట్లాడుతూ.. కౌలు రైతుల ప్రధాన సమస్య అయిన భూ యజమాని సంతకం లేకుండా చట్టాన్ని సవరించి కౌలు రైతులందరికీ కౌలు కార్డులు ఇవ్వాలని, కౌలు రైతుపేరు పైనే ఈ క్రాప్ నమోదు చేసి పంట రుణాలు ఇవ్వాలని కోరారు. అలాగే సిద్ధాపురం చెరువు కింద పంట కాలువలు పూర్తి చేసి మండలంలోని అన్ని చెరువులకు సాగు నీరు నింపాలని ఆ లేఖలో సీఎంకు కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం కమిటీ అధ్యక్షులు మార్క్స్, నాయకులు స్వాములు, నర్సింహులు, ఏలియా, సోమన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం



పల్లకిలో స్వామి, అమ్మవార్లు

శ్రీశైలం, జూన్ 30: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపములో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించి పల్లకీలో ఆశీనులనుజేసి ఆలమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఘనంగా ఉత్సవాన్ని నిర్వహించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో ఆదివారం కాకినాడకు చెందిన వాగ్దేవి నృత్య నికేతన్ బృందంతో సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహాగణపతిం, మూషికవాహన, భో-శంభో, శివాష్టకం, అర్ధనారీశ్వరం తదితర గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శనతో అలరించారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

నిత్యాన్నదాన పథకానికి విరాళం



భక్తుడికి ప్రసాదం అందజేస్తున్న ఏఈవో ఫణీధర్‌ప్రసాద్

శ్రీశైలం, జూన్ 30: శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యఅన్నప్రసాద వితరణ పథకానికి ఆదివారం హైదరాబాద్‌కు చెందిన భక్తులు సత్యప్రసాద్ కాశీభట్ల, బి. శ్రీకాంత్‌రెడ్డి కుటుంబ సమేతంగా కలిసి రూ. లక్ష చొప్పున విరాళాన్ని అదజేశారు. దేవస్థానం అధికారులు దాతకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

పింఛన్ పంపిణీకి ఏర్పాట్లు

పాములపాడు, జూన్ 30: మండలంలో అవ్వతాతలకు చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా తొలి అడుగు పడింది. సోమవారం మొదటి తేదీనే ఇంటింటికి పింఛన్లు పంచేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో సరస్వతి తెలిపారు. పాములపాడులోని ఎంపీడీవో కార్యలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో 5889 పింఛన్‌దారులకు రూ.3,91,29 కోట్లు పంపిణీ చేస్తున్నామని, ఇందులో 207 క్లస్టర్లుగా ఏర్పాటు చేసి 123 మంది సచివాలయ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. స్పెషల్ ఆఫీసర్లుగా ఎంపీడీవో, ఈఓఆర్డీ, ఏపీవో, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు వ్యవహరిస్తారని చెప్పారు.

కొత్తపల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో జవహర్‌బాబు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని రకాల పింఛన్లు 4,344 ఉన్నట్లు చెప్పారు. వీరి ఒక్కొక్కరికి రూ.7వేల చొప్పున పింఛన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ పంపిణీ ప్రక్రియకు 154 క్లస్టర్లలో 109 మంది సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పంపిణీ చేసిన వెంటనే వీరికి రశీదు ఇవ్వనున్నట్లు తెలిపారు. మండలంలో జరుగుతున్న పింఛన్ పంపిణీ ప్రక్రియను ఎంపీడీవోతో పాటు మండల వ్యవసాయాధికారి, ఎంఈవో-1, 2లు, మండల కార్యాలయ పరిపాలనాధికారి పర్యవేక్షిస్తారని తెలిపారు. 2వ తేదీ నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య చేతుల మీదుగా అందజేస్తారని తెలిపారు.

'ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది'

మహానంది, జూన్ 30: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని మహానంది మండలాధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్వినిరెడ్డి అన్నారు. ఆదివారం మహానంది మండల విద్యాశాఖాధికారి-2 బి.లింగన్న పదవీ విరమణ కార్యక్రమం మహానందిలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీతో పాటు జడ్పీటీసీ సభ్యుడు కేవీఆర్ మహేశ్వరరెడ్డిల చేత జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పలువురు ఉపాధ్యాయిలు లింగన్నను సన్మానించారు. అలాగే ఆదివారం రాత్రి మహానంది పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తు పదవీ విరమణ చేసిన బాలచంద్రుడును ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

'30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి'



మాట్లాడుతున్న అజాంబేగ్

నంద్యాల (నూనెపల్లె), జూన్ 30: ఉద్యోగులకు రావాల్సిన మధ్యంతర భృతిని 30 శాతం ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు మౌళాలి, అజాంబేగ్‌లు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం నంద్యాలలోని ఎస్టియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం 5 సంవత్సరాల కాలంలో ఉద్యోగులకు రావాల్సిన వివిధ రకాలైన ఆర్థిక బకాయిలను చెల్లించకుండా ఉద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నామని, తమకు రావాల్సిన ఆర్థిక బకాయిలను ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు నాగేంద్ర కుమార్ నరసింహరావు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

నంద్యాల (నూనెపల్లె), జూన్ 30: ఇటీవల ఏపీ లాసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 9వ ర్యాంకు, తెలంగాణ లాసెట్‌లో 71వ ర్యాంకు సాధించిన నంద్యాలకు చెందిన హర్షశ్రీకి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్జీవోస్ కాలనీకి చెందిన తొమ్మండ్రు గురుప్రసాద్ కుమార్తె హర్షశ్రీని ఆదివారం నంద్యాల ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో శ్యాంసుందర్‌లాల్, శ్యాంసుందర్ గుప్తా, నాగరాజు, రామకృష్ణ, సుధాకర్, కిరణ్ తదిరులు పాల్గొన్నారు.

'పింఛన్ పంపిణీకి ఏర్పాట్లు'

నంద్యాల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలంలో పింఛన్లను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో రమణారెడ్డి చెప్పారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని రకాల పింఛన్లు కలిపి 5,169 మంది ఉన్నారని, గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఇంటికి వెళ్లి పంపిణీ చేస్తారని అన్నారు. అలాగే ఆళ్లగడ్డ మున్సిపాలిటీలోని 27 వార్డులలో 5,092 మంది పింఛన్‌దారులు ఉన్నారని కమిషనర్ రమేష్‌బాబు చెప్పారు.

ప్యాపిలి: ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు సిద్ధం చేశామని ఎంపీడీవో సాయిమనోహర్ ఆదివారం తెలిపారు. మండలంలో మొత్తం 9076 వికలాంగ, వితంతు, వృద్ధాప్య, ఒంటరి మహిళా, చేనేత, డప్పు కళాకారుల పింఛన్లు ఉన్నాయన్నారు. పింఛన్‌దారులందరికి సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటి దగ్గరనే పిం ఛన్ డబ్బులను పంపిణీ చేస్తామన్నారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం ఉదయం 6 నుంచి ఇంటి వద్దకే ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులచే పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. మండలంలో 3,743 పింఛన్‌దారులు ఉన్నారని చెప్పారు.

చాగలమర్రి: మండలంలోని 17 సచివాలయాల పరిధిలోని ఆయా గ్రామాలలో సోమవారం ఇళ్ల వద్దకే పింఛన్ పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ 6,406 మంది పింఛన్‌దారులు ఉన్నారని తెలిపారు.

'సేవతోనే గుర్తింపు'



చంద్రశేఖరయ్య దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉయ్యాలవాడ, జూన్ 30: ఉత్తమ సేవతోనే ప్రతి ఒక్కరికీ గుర్తింపు లభిస్తుందని మండల విద్యాధికారి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బోడెమ్మనూరు గ్రామ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖరయ్య పదవీ విరమణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన విరమణ సభలో హెచ్‌ఎం చంద్రశేఖరయ్య, ఆయన సతీమణి నాగేశ్వరమ్మ దంపతులకు శాలువాకప్పి పూలమాలతో వారు సన్మానించారు. ఎంఈవో మాట్లాడుతూ చంద్రశేఖరయ్య ఎంతో మంది విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దారన్నారు. ఆయా వృత్తుల్లో ఉన్న పూర్వవిద్యార్థులు పాదాభివందనం చేశారు. హరివరం గ్రామ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు దక్షిణామూర్తి, శ్రీనివాసులు, ఆచారి, ఉపాధ్యాయ సంఘం నాయకులు శివారెడ్డి, నాగేశ్వర రావు, శ్రీనివాసరెడ్డి, కొండారెడ్డి, రవి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్య సేవలందించటమే లక్ష్యం

సంజామల, జూన్ 30: గ్రామీణులకు వైద్యసేవలు అందించటమే లక్ష్యమని మంగపల్లె వాసి నంద్యాల గురురాఘవేంద్ర విద్యా సంస్థ ల అధినేత పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి అన్నారు ఆదివారం మంగపల్లెలోని పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజావైద్యశాలలో మెగా ఉచితవైద్య శిబిరాన్ని ఏర్పా టు చేశారు. ఈ శిబిరంలో కర్నూలు, నంద్యాల పట్టణానికి చెందిన ప్రవైద్యులు గుండెజబ్బులు, బీసీ షుగర్, కీళ్ల వ్యాధులు, మోకాళ్ల నొప్పులు, చెవి ముక్కు గొంతు, కంటి జబ్బులు, చర్మ వ్యాధులకు సంబంబదించి 1400 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరానికి హాజరైన రోగులతోపాటు వారి సహా యకులకు మధ్యాహ్నం భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా దస్తగిరిరెడ్డి మాట్లాడుతూ ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

బేతంచెర్ల, జూన్ 30: బేతంచెర్ల-కర్నూలు రహదారిలోని అయ్యలవారి చెరువు ప్రాంతంలో ఒక ఫ్యాక్టరీలో ఉన్న రాజస్థాన్ నుంచి ఉపాధి కోసం వచ్చిన నేహ కుమారిపాండే (22) అనే అనాథ మహిళ ఆకస్మిక మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని తిరిగి రాజస్థాన్‌కు తీసుకువెళ్లలేని పరిస్థితుల్లో ఆమె అంత్యక్రియలు ఇక్కడే నిర్వహించాలని పోలీసుల సమక్షంలో ఆ నలుగురు స్వచ్ఛంద సంస్థ సేవా వ్యవస్థాపక అధ్యక్షుడు వన్నూరుబాషాను మృతురాలి కుటుంబ సభ్యులు కోరగా.. ఆ సంస్థ ఆధ్వర్యంలో మృతురాలికి బ్రాహ్మణ ఆచారాల ప్రకారం స్థానిక బేతంచెర్ల శ్మశాన వాటలికలో దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు లక్ష్మిరాఘవ, యూసుఫ్, అక్బర్, వెంకటేశ్వర్లు, మాబాషా పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా శ్రీనివాసులు

దొర్నిపాడు, జూన్ 30: మండలంలోని దొర్నిపాడు ఎంపీడీవో పి.వెంకటసుబ్బారెడ్డి పదవీ విరమణ పొందడంతో దొర్నిపాడు ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా సచివాలయ సిబ్బందికి సూచించామని అన్నారు. ప్రజలకు ఎల్లవేలలా అందుబాటులో ఉంటామన్నారు. ఏవైన సమస్యలు ఉంటే పరిష్కరిస్తామన్నారు.

ఎస్ఐకి సన్మానం

బేతంచెర్ల, జూన్ 30: ప్రభుత్వ పోలీసు శాఖలో సమాజంలో ప్రజలందరికి ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు మంచి పేరు ప్రతిష్టలు సంపాదించుకోవచ్చని బేతంచెర్ల సీఐ ప్రియతమ్ రెడ్డి అన్నారు. ఆదివారం బేతంచెర్ల పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో బేతంచెర్ల ఎస్ఐగా విదులు నిర్వహిస్తూ పదవి విరమణ పొందిన కరీముల్లాను పూలమాలలు వేసి శాలువలతో కరీముల్లా దంపతులను సన్మానించారు. ఎస్ఐ శివశంకర్ నాయక్, ఏఎస్ఐ లింగమయ్య, హెడ్ కానిస్టేబుల్, పోలీస్ కానిస్టేబుళ్లు, మహిళా పోలీసులు కరీముల్లా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మించాలి

డోన్(రూరల్), జూన్ 30: పట్టణంలోని గుత్తి రోడ్డులో ఉన్న జ్యోతిరావుపూలే బీసీ బాలికల గురుకుల హాస్టల్ చుట్టూ ప్రహరీ నిర్మించా లని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శివన్న డిమాండ్ చేశారు. ఆదివారం డోన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురుకుల హాస్టల్ చుట్టూ ప్రహరీ లేకపోవడం వల్ల విద్యార్థులకు భద్రత లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: మంత్రి బీసీ

కోవెలకుంట్ల, జూన్ 30: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఏపీ రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం 4గంటలకు కోవెలకుంట్లలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చేరుకున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కోవెలకుంట్ల పట్టణంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రజలు టీడీపీకి భారీ మెజార్టీ అందించారు. బీసీ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారిగా బనగానపల్లె వచ్చారు. అయితే మంత్రిని కలవడానికి బనగానపల్లె నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అభిమానులు బనగానపల్లెకు తరలివస్తుండడంతో అభిమానులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు తాను మండలాలకు వచ్చి అక్కడి నాయకులు, కార్యకర్తల ను కలుస్తానని చెప్పారు. అందులో భాగంగా ఆదివారం కోవెలకుంట్లకు వస్తున్నారని తెలుసుకున్న అభిమానులు, టీడీపీ శ్రేణులు కోవెలకుంట్ల పట్టణంలో ప్రధాన వీధుల్లో పెద్ద కటౌట్‌లు, బ్యానర్లను ఏర్పాటు చేశారు. అయితే ఆదివారం మండల సర్వసభ్య సమావేశం ఉండడంతో ఉదయం రావలసిన మంత్రి సాయంత్రం కోవెలకుంట్ల చేరుకున్నారు. మంత్రి వస్తున్నా రని తెలుసుకున్న టీడీపీ శ్రేణులు



మంత్రి బీసీని సత్కరిస్తున్న ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు



టీడీపీ నాయకులు, కార్యకర్తలకు అభివాదం చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

పెద్దఎత్తున ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్ చేరుకున్నారు. మంత్రి కారులో నుంచి దిగి ప్రతి ఒక్కరికి అభివాదం చేసి ఆప్యాయతగా పలకరించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన ప్రతి నాయకుడు, కార్యకర్త అభిమానిని తాము ఎన్నటికీ మరుచిపోమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గడ్డం రామక్రిష్ణరెడ్డి, గడ్డం నాగేశ్వర్‌రెడ్డి, గువ్వల సుబ్బారెడ్డి, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, కలుగొట్ల అర్జున్‌రెడ్డి, మద్దిలేటి, ధనుంజయుడు, బిజినేముల హుసేనయ్య, బుజ్జన్న, జగదీశ్వర్‌రెడ్డి, రేవనూరు నరసింహారెడ్డి, కంపమల్ల సుబ్బారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, భీము నిపాడు సునీల్‌రెడ్డితోపాటు వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి బీసీకి సన్మానం

బనగానపల్లె: రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని ఆదివారం టీడీపీ కార్యాలయంలో బనగానపల్లె యూని ట్ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. బీసీకి బొకే ఇచ్చి, శాలువాతో సత్కరించారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని వారు మంత్రి బీసీని కోరారు.

కోట్లను కలిసిన చల్లా విజయభాస్కర్ రెడ్డి



కోట్లను అభినందిస్తున్న చల్లా విజయభాస్కర్‌రెడ్డి, మొట్ల రామిరెడ్డి

అవుకు, జూన్ 30: డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డిని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయభాస్కర్‌రెడ్డి, కాశీపురం గ్రామ టీడీపీ నాయకుడు మొట్ల రామిరెడ్డి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. కోట్ల సొంత గ్రామం లద్దగిరికి వెళ్లి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలపారు. చల్లా మాట్లాడుతూ 40 ఏళ్లుగా కోట్ల కుటంబంతో తమ కుటుంబానికి మంచి సంబంధాలు కొనసాగుతున్నాయన్నారు. కోట్ల ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన వెంటనే డోన్ నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, సమస్యలకు పరిష్కారం చూపుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తల్లో నూతన ఉత్తేజాన్ని కలిగిస్తున్నారని అన్నారు.

నేడు ఎమ్మెల్యే కోట్ల రాక

ప్యాపిలి, జూన్ 30: మండలంలోని బూరుగుల, కౌలపల్లి గ్రామాలకు సోమవారం డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి వస్తున్నట్లు ఆదివారం టీడీపీ డోన్ నియోజకవర్గం పార్టీ సమన్వయకర్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆయా గ్రామాల్లో ఆయన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు చెప్పారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యక ర్తలు హాజరు కావలని ఆయన కోరారు.

క్రీడాకారుల సంబరాలు

నంద్యాల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): భారత క్రికెట్ జట్టు టీ-20లో విజయం సాధించటంతో ఆళ్లగడ్డ పట్టణంలో క్రీడాకారులు ఆదివారం బైకు ర్యాలీ చేశారు. క్రికెట్ జట్టు విజయం సాధించటంతో క్రీడాకారులు జట్టుకు అభినందనలు తెలిపారు. టీ-20 ఫార్మట్‌లో భారత జట్టు రెండోసారి ప్రపంచ విజేతగా నిలిచిందని క్రీడాకారులు తెలిపారు.

చంద్రబాబు చరిత్రలో నిలిచిపోతారు: సుబ్బారెడ్డి



టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు జనార్దన్‌ను కలిసిన సుబ్బారెడ్డి

డోన్, జూన్ 30: పేదల జీవనానికి ఆర్థిక భరోసా కల్పించిన సీఎం చంద్రబాబు చరిత్రలో నిలిచిపోతారనీ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాదులో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్‌ను సుబ్బారెడ్డితో పాటు యువ నాయకుడు దర్మవరం గౌతమ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బందులను చంద్రబాబు ఎదుర్కొని పోరాటం సాగించారన్నారు. రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు అండగా నిలిచి వారి సమస్యలపై ధర్మయుద్ధం చేస్తూ వచ్చారన్నారు. వాటి ఫలితంగానే టీడీపీ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు సామాజిక పింఛన్లను రూ.4వేలకు పెంచారని, వికలాంగుల పింఛన్లను రూ.6వేలకు పెంచి ఆర్థిక భరోసా కల్పించారన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే అఖిలప్రియ

చాగలమర్రి, జూన్ 30: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. మొదటిసారిగా ఆదివారం చాగలమర్రిలోని పీఆర్టీయూ కార్యాలయం సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చాగలమర్రి గ్రామంలోని పీఆ ర్టీయూ కార్యాలయంలో ఆదివారం పీఆర్టీయూ నాయకులు, ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్లా, హెచ్‌ఎం విజయమ్మ ఎమ్మెల్యేను శాలువ, పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని అన్నారు. ప్రజా ప్రభుత్వ పాలన వచ్చిందని, ఉపాధ్యాయుల సమస్యలు తీరుతాయని అన్నారు. తమపై ఉన్న నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించారని, వారిని ఎన్నటికీ మరువమని అన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు రవింద్రారెడ్డి, ఆంజనేయరెడ్డి, మౌళాలి, భార్గవ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సుబ్బరాయుడు, రవిప్రకాష్‌రెడ్డి, దాదాపీర్, షాహిర్, రషీద్‌ఖాన్, దస్తగిరి బుర్రానుద్దీన్‌బాబా, సీఆర్పీలు పాల్గొన్నారు.

● చింతలచెరువు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎం.వెంకటసుబ్బారెడ్డి పదవీ విరమణ సందర్భంగా ఆదివారం ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే భూమా అఖిల పాల్గొన్నారు. పదవీ విరమణ చేసిన వెంకటసుబ్బారెడ్డి దంపతులను భూమా అఖిలప్రియ శాలువ, పూలమాలలతో సన్మానించి పాఠశాల ఉపాధ్యాయులు అందజేసిన జ్ఞాపికను అందజేశారు. జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పదవీ విరమణ చేసిన వెంకటసుబ్బారెడ్డి దంపతులను సన్మానించారు. ఎస్టీయూ, పీఆర్టీయూ నాయకులు, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు కూడా సన్మానించారు.



అఖిలప్రియను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఆళ్లగడ్డ: నియోజకవర్గంలోని ప్రతి సామాజిక వర్గాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే అఖిలప్రియ, ఆమె భర్త భార్గవ్‌రామ్‌నాయుడు అన్నారు. ఎమ్మెల్యే అఖిలప్రియను ఆళ్లగడ్డ తాలుకా బలిజ సంఘీయులు నల్లగట్ల బాలుడు ఆధ్వర్యంలో ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. వారు మాట్లాడుతూ టీడీపీ విజయానికి కృషి చేసిన వారిని గుర్తుంచుకొని న్యాయం చేస్తామన్నారు. అలాగే రాష్ట్ర దూదేకుల ఫెడరేషన్ చైర్మన్ డాక్టర్ బాబన్ ఎమ్మెల్యే అఖిలప్రియను ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రులను కలిసిన మైనార్టీ నాయకులు



మంత్రి బీసీని సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 30: మండలంలోని పేట్నికోట గ్రామానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు అబ్దుల్‌ఖాదర్, అబ్దుల్ రహీమ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, మైనార్టీ, సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్‌లను కలిసి సన్మానించారు. లాయర్ దస్తగిరి బాలహాజీ, పేట్నికోట ఫీల్డ్ అసిస్టెంట్ దస్తగిరి, అబ్దుల్ రహమాన్ పాల్గొన్నారు.

'ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి'

నంద్యాల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆ సంఘం నూతన అధ్యక్షుడు దేవిశెట్టి హరీష్‌బాబు అన్నారు. ఆళ్లగడ్డ కన్యాకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గం పదవీ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి మహేష్, కోవెలకుంట్ల అధ్యక్షుడు పెండెకంటి సుబ్రమణ్యం, కోవెలకుంట్ల టౌన్ బ్యాంకు అధ్యక్షుడు శ్రీనివాసరావు, రుద్రవరం అధ్యక్షుడు సూర్యనారాయణ, మాజీ అధ్యక్షులు శివయ్య, వినోద్‌కుమార్, వెంకటసుబ్బయ్య, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

జీవో నెంబరు 117ను రద్దు చేయాలి: ఎస్టీయూ

చాగలమర్రి, జూన్ 30: రాష్ట్రంలో విద్యను నిర్వీర్యం చేసే జీవో నెంబరు 117ను రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాషా డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని, సీపీఎస్ రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు శివశంకర్, మస్తాన్ బాషా, సుబ్బారావు, మాబుహుసేన్, నారాయణరెడ్డి, గురుచంద్రుడు, రాజశేఖర్‌రెడ్డి, సురేషప్ప తదితరులు పాల్గొన్నారు.

21న భక్తి గీతాల పోటీలు

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 30: కొలిమిగుండ్లలోని షిరిడీ సాయి సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో జూలై 21న బాల బాలికలకు భక్తి గీతాల పోటీ లు నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గనులు, భూగర్భశాఖ రిటైర్డ్ డైరెక్టర్ విడి రాజగోపాల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకొని ఈనెల 21న ఉద యం 11 గంటలకు సాయిబాబా ఆడిటోరియంలో ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని, ఆసక్తి కలిగిన బాల, బాలికలు తమపేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

106 సెక్షన్‌ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

బేతంచెర్ల, జూన్ 30: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగంపై హిట్ అండ్ రన్ (106) (1) (2) సెక్షన్‌ను రద్దు చేయాలని బేతంచెర్ల లారీ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రద్దు చేయాలని ఆల్ ఇండియా ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్యలు డిమాండ్ చేశారు. ఆదివారం లారీ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం మద్దిలేటి స్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు, యు.హరి ప్రసాద్, రామచంద్రుడు, రాజు, వెంకట్రాముడు, మల్లికార్జున, కోట్ల మధు, శేఖర్, గఫూర్, రామళ్లకోట బాషా, నారాయణ పాల్గొన్నారు.

నేడు టీడీపీ నాయకులతో మంత్రి సమీక్ష

సంజామల, జూన్ 30: మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సోమవారం రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు మంత్రి వ్యకిగత కార్యదర్శి మురళీ మోహన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. సోమవారం కోవెలకుంట్లలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ లో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తల సమీక్ష ఉంటుందన్నారు.

పెద్దమౌలాలి మృతి తీరని లోటు

డోన్(రూరల్), జూన్ 30: డోన్ పట్టణం ఎస్‌కేపీ హైస్కూలుకు చెందిన రిటైర్డు టీచర్ పెద్ద మౌలాలి మృతి పెన్షనర్లకు తీరని లోటు అని పెన్షనర్ల సంఘం గౌరవాధ్యక్షులు శతావధాని దత్తాత్రేయ శర్మ, అధ్యక్షుడు కేఎస్ భానుసింగ్ అన్నారు. ఆదివారం పెన్షనర్ల సంఘం కార్యాలయంలో సంఘం సభ్యులు పెద్ద మౌలాలి సంతాప సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు హనీఫ్, గోపాల్, గాలయ్య, సుబ్బరాయుడు, రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు డీకే నరసింహులు, పెద్ద మౌలాలి కుమారుడు న్యాయవాది మస్తాన్ పాల్గొన్నారు.

ఏపీ ట్యాక్స్ ప్రాక్టీషనర్ అసోసియేషన్ సభ్యుడిగా అబ్దుల్ సలాం

బేతంచెర్ల, జూన్ 30: పట్టణానికి చెందిన ఇన్‌కం ట్యాక్స్ అండ్ జీఎస్టీ ప్రాక్టీషనర్, అడ్వకేట్ అబ్దుల్ సలాం ఏపీ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులుగా నంద్యాల జిల్లా తరఫున నియమితులయ్యారు. ఆదివారం అనంతపురంలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో తనతోపాటు ప్రాక్టీషనర్స్ సంజీవ్, వీర, గోపాల్ పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

రుద్రవరం, జూన్ 30: మండలంలోని చిన్నకంబలూరు, రుద్రవరం, కొండమాయపల్లె గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మ, మారెమ్మ, సుంకులమ్మ అమ్మవార్లకు పూజలు చేశారు. భక్తులు నైవేద్యం, చీరలు సమర్పించారు.

లింగమయ్యకు..: మండలంలోని ముత్తులూరు గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగ మయ్యస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామికి నైవేద్యం సమర్పించారు.

నేడు ఆలయ భూములకు కౌలు వేలం

దొర్నిపాడు, జూన్ 30: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో వెలసిన నాగేశ్వరస్వామి, చెన్నకేశవస్వామి ఆలయాలకు చెందిన ఆలయ భూములను సోమవారం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహణాధికారి చంద్రుడు తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనే వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

పింఛన్ పంపిణీకి ప్రత్యేకాధికారులు

రుద్రవరం, జూన్ 25: పింఛన్ల పంపిణీ సరళిపై ప్రత్యేక అధికారులను నియమించినట్లు మండల అధికారులు ఆదివారం తెలిపారు. సోమవారం టీడీపీ ప్రభుత్వం పెంచిన పింఛన్లను పంపిణీకి శ్రీకారం చుట్టింది. రుద్రవరం మండలంలో 6401 మంది పింఛనుదారులు ఉన్నారు. పింఛను పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించడానికి ఎంపీడీవో రామచంద్ర, ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ, ఏపీవో ప్రతాప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్, పీఆర్ ఏఈ వెంకట్రాముడును నియమించినట్లు అధికారులు తెలిపారు.

పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలి: సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

డోన్(రూరల్), జూన్ 30: మండలంలోని యాపదిన్నె గ్రామ శివారులో పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని యాపదిన్నె గ్రామ శివారులో ఉన్న భూముల్లో ఎర్రజెండాను పాతి భూపోరాటాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కటారుకొండ సర్పంచ్ నక్కి లెనిన్‌బాబు, సీపీఐ పట్టణ కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు.

'చెంచులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి'



మాట్లాడుతున్న గాలి రవిరాజ్

శిరివెళ్ల, జూన్ 30: నల్లమల అటవీ ప్రాంతంలోని పచ్చర్లలో నివాసముంటున్న చెంచులకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలను(ఎస్టీ) ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి గాలి రవిరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం పచ్చర్లలో ఆయన మాట్లాడుతూ చెంచులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల చిరుత పులి దాడిలో మృతి చెందిన మాజీ ఉప సర్పంచ్ షేక్ మెహరున్నిషా కుటుంబానికి తగిన న్యాయం చేయడంతో పాటు వన్యప్రాణుల దాడుల నుంచి స్థానికులకు రక్షణ కల్పించాలని కోరారు. మహానంది ఆలయ పరిసరాల్లో సంచరిస్తున్న చిరుతను అటవీ శాఖ అధికారులు త్వరగా పట్టుకోవాలని కోరారు.

మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించండి



మొక్కలు నాటుతున్న దేవానంద్ తదితరులు

కోవెలకుంట్ల, జూన్ 30: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించాలని బీజేపీ ఎస్సీ సెల్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు దేవానంద్ అన్నారు. ఆదివారం కోవెలకుంట్ల పట్టణంలోని ఎస్సీ కాలనీలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన అమ్మ కోసం ఓ చెట్టు కార్యక్రమం బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు లింగన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా దేవానంద్ హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లు ప్రగతికి మెట్లని అన్నారు. రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యవర్గసభ్యుడు చాందిని, జిల్లా అధికార ప్రతినిధి వెంకటసుబ్బయ్య, పట్టణ అధ్యక్షులు సుబ్బయ్య, లక్ష్మయ్య, బీమయ్య పాల్గొన్నారు.

పుట్టాలమ్మకు పూజలు



పుట్టాలమ్మను దర్శించుకునేందుకు బారులు దీరిన భక్తులు

నంద్యాల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలంలోని ఆర్.క్రిష్ణాపురంలో వెలిసిన రామతీర్థం పుట్టాలమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు మొక్కుబడులు తీర్చుకొని కానుకలు సమర్పించుకున్నారు. భక్తులకు వేదపండితులు అన్నదానం చేశారు.

గంగమ్మకు..

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని గంగమ్మ, పెద్దమ్మ దేవతలకు ఆదివారం మహిళలు బోనాలు సమర్పించి విశేష పూజలు చేశారు. వరుణ దేవుడు కరుణించాలంటూ ప్రత్యేక పూజలు చేశారు. గంగమ్మ ఆలయంలో 108 దీపోత్సవం చేశారు. అలాగే చాగలమ్మ ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.